సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 3, జనవరి, 2024



ఫలితాల పెంపుపై శ్రద్ధ

ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. 10లో



జరిగినట్టా.. లేనట్టా..?

సింగరేణిలో రెండు విభాగాల అభ్యర్థులకు నియామకపత్రాలు ఇచ్చి, వెంటనే రద్దు చేయడం అనుమానాలకు తావిస్తోంది. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మంచు, చలి ప్రభావం కనిపిస్తుంది.



గని.. గాడిన పడేనా?

- సీఎండీ బలరామ్‌కు సమస్యలతో వెల్‌కమ్
- కొండలా పేరుకుపోయిన బకాయిలు
- కొత్త గనుల ప్రారంభంలో కనిపించని కదలిక
- శ్రీధర్ హయాంలో బలోపేతమైన సింగరేణి
- చివరి నాలుగేళ్లలో సీఎండీపై విమర్శల వెల్లువ



బలరామ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సుదీర్ఘ విరామం తర్వాత సింగరేణి సంస్థకు కొత్త చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వచ్చారు. వరుసగా తొమ్మిదేళ్ల పాటు ఈ పోస్టులో కొనసాగిన ఐఏఎస్ అధికారి ఎన్.శ్రీధర్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రస్తుతం డైరెక్టర్ (పా) హోదాలో ఉన్న ఎన్.బలరామ్‌కు సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

బకాయిలు రాబట్టాలి..

సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో 90 శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకే వెళ్తోంది. అందులోనూ సింహభాగం టీఎస్ జెన్‌కోకు సరఫరా చేస్తోంది. ఈ బొగ్గుకు సరిపడా బిల్లులు జెన్‌కో నుంచి సింగరేణికి రావడం లేదు. సుమారు రూ.19 వేల కోట్ల బిల్లులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని రాబట్టి సింగరేణి విస్తరణ, ఇతర పనులకు ఉపయోగించాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం లోకి వచ్చేనాటికి 80 శాతం ఉత్పత్తి సాధ్యమైంది. మరో మూడు నెలల్లో మిగిలిన 20 శాతం ఉత్పత్తి సాధించేలా చూడాలి. ముఖ్యంగా వంద శాతం ఉత్పత్తి సాధించడంలో విఫలమవుతున్న భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పలు విజయాలు కూడా..

సింగరేణి సీఎండీగా 2015లో పదవీ బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి ఎన్.శ్రీధర్ మొదటి నాలుగేళ్ల తన పనితీరుతో అద్భుతమైన మార్పులు తీసుకొచ్చారు. అప్పటి వరకు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 52 మిలియన్ టన్నుల దగ్గరే ఉన్న సంస్థను 60 మిలియన్ టన్నుల దిశగా అడుగులు వేయించి విజయం సాధించారు. ప్రస్తుతం సంస్థ 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతోంది. బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ రంగంలో సింగరేణి అడుగు పెట్టి విజయం సాధించి సినర్జీగా నిలిచింది.

మూడేళ్లుగా ఇటు రాలేదు..

రాష్ట్రంలో బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎండీ శ్రీధర్ పనితీరు విమర్శలకు దారి తీసింది. సీఎండీగా ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. 2019లో చివరిసారిగా కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయానికి ఆయన వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగూడెం వైపు కన్నెత్తి చూడలేదు. కొత్త గనుల ప్రారంభం విషయంలో జాప్యం జరుగుతున్నా నివారించేందుకు సీఎండీగా సరైన చొరవ చూపలేదన్న విమర్శలు ఆయనపై ఉన్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉన్న ఒడిశాలోని నైనీ బ్లాక్ విషయంలో ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. అక్కడి ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపేందుకు అవసరమైనంత సమయం కేటాయించలేదు. గుర్తింపు కార్మిక సంఘంతో ప్రతీ ఆరు నెలలకు ఓసారి సమావేశం కావాల్సి ఉండగా ఆ విధానాన్నీ ఆయన అటకెక్కించారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో పేపర్ లీకేజీలు, కారుణ్య నియామకాల్లో పైరవీకారుల హవాను నివారించడంలో ఆయన విఫలమయ్యారనే విమర్శలు మూటగట్టుకున్నారు. మరి కొత్త సీఎండీ బలరామ్ హయాంలోనైనా సంస్థ గాడిన పడుతుందా అని కార్మికుల్లో చర్చ జరుగుతోంది.

నియామకాల్లో వివాదాలు..

ఆర్థిక అంశాలతో పాటు సింగరేణిలో నియామకాల విషయంలో వివాదాలు కేంద్ర బిందువుగా మారాయి. గడిచిన నాలుగేళ్లలో వివిధ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు జారీ చేయడం, పేపర్లు లీవకడం వంటివి సంస్థ ప్రతిష్టను మసకబారేలా చేశాయి. ఉత్తర తెలంగాణకు ఉపాధి పరంగా పెద్ద దిక్కుగా ఉన్న సింగరేణిలో ఇకనైనా రిక్రూట్‌మెంట్‌ను పక్కాగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సర్వత్రా అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కారుణ్య నియామకాల్లో పైరవీకారుల జోక్యం మితిమీరింది. ఒక ఉద్యోగం రావాలంటే అనధికారికంగా కనీసం రూ.ఐదు లక్షల వరకు చేతులు తడపాల్సిన దుస్థితి సింగరేణి కార్మికులపై పడుతోంది. మెడికల్ బోర్డులో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

కొత్త గనుల ప్రారంభమెప్పుడో..

గడిచిన ఐదేళ్లలో సింగరేణిలో కొత్తగా ఒక్క గని కూడా ప్రారంభం కాలేదు. గత ఆర్థిక సంవత్సరంలోనే వెంకటేశ్‌ఖని-7 (కొత్తగూడెం), రొంపేడు ఓపెన్ కాస్ట్ (ఇల్లెందు), కొండాపూర్ ఓసీ ఎక్స్‌టెన్షన్, కాకతీయ ఖని-5 (మందమర్రి) గనులు ప్రారంభం కావాల్సి ఉంది. మరో మూడు నెలల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి వస్తున్నా.. ఏ ఒక్క గని నుంచీ బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. కేంద్రం నుంచి ఎన్‌ఓసీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ వంటి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ గనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడం కొత్త సీఎండీకి ప్రధాన సవాల్ కానుంది.

మంత్రులను కలిసిన ఎస్పీ



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ



మంత్రి తుమ్మలతో వినీత్

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎస్పీ డాక్టర్ వినీత్ మర్యాదపూర్వంగా కలిశారు. ఖమ్మంలోని మంత్రుల క్యాంప్ కార్యాలయాలకు వెళ్లిన ఎస్పీ.. వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అభివృద్ధిలో 'కొత్త' పుంతలు తొక్కాలి



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన వివిధ శాఖల అధికారులు

నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ పిలుపు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పనిచేసి జిల్లాను అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కేక్ కట్ చేసి అధికారులకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో అన్ని శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యం మేరకు విధులు నిర్వహిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. గత నెల 28 నుంచి చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని, ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని సూచించారు. జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు చేస్తున్న కృషిలో ప్రభుత్వ యంత్రాంగానికి ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో గిరిజనులు అధికంగా నివసించే జిల్లా ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.రాంబాబు, మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంగం వెంకటపుల్లయ్య, టీఎస్‌జీటీఎస్ అధ్యక్షుడు రామారావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్‌రవి తదితరులు కూడా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీ చైర్మన్ శుభాకాంక్షలు..

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలకు జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఆ తర్వాత చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ మొరిశెట్టి భవానీప్రసాద్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యూస్‌రీల్

వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన తుమ్మల



మామిడితోటలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని సొంత వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మామిడి, పామాయిల్ తోటల్లో తిరుగుతూ అందులో పనిచేసే వారికి పలు సూచనలు చేశారు. కాగా బుధవారం గండుగులపల్లిలో సీతారామ ప్రాజెక్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సంబంధించి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. కాగా, మామిడి తోటలో ఉన్న తుమ్మలను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో ఐబీ ఈఈ సురేష్, డీఈ కృష్ణ, నాయకులు అలపాటి ప్రసాద్, కోటగిరి సత్యంబాబు, ఎర్రా వసంతరావు, కాసాని నాగప్రసాద్, కెవి సత్యనారాయణ, రాధాకృష్ణ ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఎన్‌క్వాస్ బృందం పరిశీలన



సింగభూపాలెం ఆస్పత్రిలో సిబ్బందితో ఎన్‌క్వాస్ సభ్యులు

సుజాతనగర్: మండలంలోని పాత అంజనాపురం, సింగభూపాలెం గ్రామాల్లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్) బృందం మంగళవారం తనిఖీలు నిర్వహించింది. బృందం సభ్యులు డాక్టర్ ఏఎం ఆమ్‌జీ, ఎస్.వసంత్, డాక్టర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా విభాగాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్‌క్వాస్‌కు అనుగుణంగా సేవలు అందుతున్నాయా లేదా అనే విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీడీఓ పర్యానాయక్, క్వాలిటీ పీఓ స్పందన తదితరులు పాల్గొన్నారు.

త్రికూట మందిరానికి వెండి కిరీటాలు



వెండి కిరీటాలను అందజేస్తున్న దాతలు

చర్ల: మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ త్రికూట దేవాలయాలనికి చర్లకు చెందిన దాతలు మంగళవారం వెండి కిరీటాలు బహూకరించారు. ఆలయంలోని లక్ష్మీ గణపతి స్వామికి మాన్యం పురుషోత్తం – లక్ష్మి దంపతులు, లక్ష్మీదేవి అమ్మవారికి ముతికి విజయశేఖర్ – పార్వతి దంపతులు రజిత కిరీటాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్చరణల నడుమ కిరీటాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు శిరీష, సంతోష్‌కుమార్, సాయిశ్రీ కీర్తి, హరీష్‌తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలి



దరఖాస్తులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: ప్రజాపాలన గ్రామ, వార్డు సభలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిశీలించి ప్రతీ కాలాన్ని నింపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దరఖాస్తులన్నింటినీ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు లబ్ధిదారులకు రశీదులు అందజేయాలని ఆదేశించారు.

అభయ రాముడికి వైభవంగా రాపత్తు సేవ

నేటి నుంచి విలాసోత్సవాలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని అభయ రాముడిగా అలంకరించారు. రాపత్తు సేవల్లో చివరి రోజున గ్రామపంచాయతీ కార్యాలయంలోని నరసింహస్వామి మండపంలో ఈ వేడుకను వైభవోపేతంగా నిర్వహించారు. పల్లకీలో స్వామి వారిని ఆశీనులను చేసి మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. అక్కడ ప్రత్యేక పూజల తర్వాత భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కాగా, బుధవారం నుంచి మూడు రోజుల పాటు విలాసోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, బిల్ కలెక్టర్లు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయంగా నిత్యకల్యాణం

శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యక్రతువు ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆ తర్వాత అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

పెట్రోల్.. నో స్టాక్ !

బంక్‌ల్లో వెలిసిన బోర్డులు





ఓ బంక్ వద్ద బారులుదీరిన వాహనదారులు (ఇన్‌సెట్) మరో బంకులో పెట్టిన నో స్టాక్ బోర్డు

ఆయిల్ ట్యాంకర్ల సమ్మె మూలంగా ఐదు రోజుల పాటు పెట్రోల్ బంకులు మూతపడతాయనే పుకార్ల నేపథ్యంలో వాహనదారులు మంగళవారం రాత్రి బంకుల వద్ద బారులు దీరారు. మండలంలో మొత్తం మూడు బంకులు ఉండగా.. రెండు బంకుల్లోని పెట్రోల్, డీజిల్ నిండుకోవడంతో నో స్టాక్ బోర్డు పెట్టారు. దీంతో వాహనదారులు స్థానిక నాయక్ బంక్ వద్ద పెద్ద ఎత్తున క్యూ కట్టారు. విరివిగా వాహనాలు రావడంతో నిర్వాహకులు కొంచెం సేపు పెట్రోల్, డీజిల్ పోసి ఆ తర్వాత నిలిపేశారు. చివరకు ఎస్ఐ సోమేశ్వర్ అక్కడికి చేరుకుని వాహనదారులను వరుస క్రమంలో వచ్చేలా చేయగా.. అప్పుడు వాహనాల్లో పెట్రోల్ పోశారు. కాసేపటి తర్వాత వారు కూడా నో స్టాక్ బోర్డు పెట్టడం గమనార్హం. –సుజాతనగర్

'ఆన్‌లైన్'తో ఆదాయం..

- భద్రాద్రి రామయ్యకు ముక్కోటితో భారీగా రాబడి
- ముందస్తు నిర్ణయంతో టికెట్ల విక్రయంలో జోష్
- ప్రత్యేక ప్రణాళికతో విజయం సాధించిన అధికారులు



ఉత్తరద్వారం నుంచి శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు (ఫైల్)

భద్రాచలం: భద్రగిరి రామయ్యకు ముక్కోటి ఉత్సవాల సందర్భంగా 'ఆన్‌లైన్' సేవలు ఆదాయాన్ని సమకూర్చాయి. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈఓగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి జరిగిన ముక్కోటి ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా చూడడంతో పాటు ముందస్తుగా చేపట్టిన ప్రణాళికలు లాభాలను తెచ్చిపెట్టాయి. ప్రధానంగా ప్రతి ఏడాది ఉత్తర ద్వార దర్శనం టికెట్లు భారీగా మిగిలేవి. కానీ ఈ ఏడాది నెల ముందుగానే వాటిని ఆన్‌లైన్‌లో ఉంచటంతో 93 శాతం మేర విక్రయాలు జరిగాయి. దేవస్థానం వసతి గృహాలు, కాటేజీలనూ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడంతో భక్తులు వాటిని వినియోగించుకునే అవకాశం కలిగింది. పరోక్ష సేవల పేరిట ఆన్‌లైన్‌లో సదుపాయాన్ని కల్పించడం కూడా కలిసొచ్చింది. భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ హుండీ ఆదాయం కూడా పెరిగింది.

సెక్టార్ టికెట్లతో రూ.33 లక్షలు..

ఉత్తర ద్వార దర్శనానికి వివిధ సెక్టార్ల టికెట్ల విక్రయాల ద్వారా రూ.32,79,750 ఆదాయం లభించింది. రూ.2వేల విలువ గల 1400 వీఐపీ టికెట్లలో 200 రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఆన్‌లైన్‌లో ఉంచిన 1000 టికెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయి. ఆఫ్‌లైన్‌లో ఉంచిన వాటిలో 145 టికెట్లు మిగిలాయి. రూ.500 విలువైన బీ, సీ, డీ సెక్టార్ల టికెట్లు 1330కి గాను 115, రూ.250 విలువ గల టికెట్లు 650కి గాను 649 విక్రయించారు. ఇలా మొత్తంగా ఆన్‌లైన్, కౌంటర్ల ద్వారా 3,580 టికెట్లను అందుబాటులో ఉంచగా 3,319 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. వీటికి తోడు పరోక్ష సేవల టికెట్ల ద్వారా రూ.38వేల ఆదాయం లభించింది. దీంతో కేవలం టికెట్ల విక్రయాల ద్వారానే రూ.33,17,750 రామయ్య ఖాతాకు చేరాయి. ఇలా టికెట్ల విక్రయాల ద్వారానే ముక్కోటి ఉత్సవానికి ఇంత ఆదాయం రావడం 'రికార్డు' కావడం గమనార్హం.

ముక్కోటి ఆదాయం రూ. 67లక్షలు..

ముక్కోటి సందర్భంగా టికెట్లు, లడ్డూలు, వసతి గృహాలు, దర్శన టికెట్ల ద్వారా రూ. 67,31,342 ఆదాయం లభించింది.


ఆన్‌లైన్‌లో సేవలు, వసతులు..

ఈఓగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆలయంలో వివిధ సేవలు, భక్తులకు కల్పించే వసతులను దేవస్థానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో పాటు కొత్తగా ప్రవేశపెట్టిన పూజల వివరాలను పొందుపర్చారు. కాగా భద్రాచలం వచ్చే భక్తులు వసతి కోసం ఇబ్బంది పడకుండా దేవస్థానం ఆధ్వర్యంలో ఉన్న వసతిగృహాలు, కాటేజీలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో వసతిగృహాల ద్వారా వచ్చే ఆదాయం గతం కంటే చాలా పెరిగింది. ముక్కోటి ఉత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ప్రత్యేక కౌంటర్ల ద్వారా లడ్డూ ప్రసాదాలు విక్రయించారు. ఇక వరుసగా ముక్కోటి, వారాంతపు సెలవులు, క్రిస్మస్ సెలవులు రావడంతో రామాలయం భక్తులతో కిటకిటలాడింది. నిత్యం 20 వేల మందికి తగ్గకుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వెరసి ముక్కోటి ఉత్సవం రామయ్యకు గణనీయంగా ఆదాయాన్ని సమకూర్చింది.

ఆన్‌లైన్‌లో దేవస్థానం క్యాలెండర్లు..

ఈ ఏడాది ఆంగ్ల సంవత్సర దేవస్థాన క్యాలెండర్లను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. స్వామివారి వివిధ బొమ్మలతో ఆకర్షణీయంగా రూపొందించిన ఈ క్యాలెండర్‌ను దేవస్థానం వద్ద రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దేవస్థానం వెబ్‌సైట్‌లో బుక్ చేసుకుంటే రూ. 200కు భక్తుల ఇంటి వద్దకే వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఈ సేవలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ అధికారులు కోరుతున్నారు.

పారదర్శకతకు పెద్దపీట



దేవస్థానంలో పారదర్శకతకు పెద్దపీట వేశాం. ముక్కోటికి ముందస్తుగా చేపట్టిన ప్రణాళికతోనే ఆదాయం మెరుగుపడింది. ఉద్యోగులు, సిబ్బంది సహాయ సహకారాలతో ఉత్సవాలను విజయవంతం చేశాం. ప్రధానంగా ఆన్‌లైన్‌లో భక్తులకు అందుబాటులోకి తెచ్చిన సేవలు సత్ఫలితాలు ఇచ్చాయి. మున్ముందు ఇదే స్ఫూర్తితో భక్తులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తాం.

– ఎల్ రమాదేవి, ఆలయ ఈఓ

ఆదాయం వివరాలిలా..(రూ.లలో)

సెక్టార్ల టికెట్ల విక్రయాల ద్వారా	32,79,750
పరోక్షంగా రూ.వెయ్యి, రూ.రెండు వేల టికెట్ల విక్రయాలతో	38,000
ఉత్తర ద్వార దర్శనం, ప్రత్యేక దర్శనం టికెట్లతో	2,72,600
ప్రత్యేక దర్శనం, ఇతర సేవల ద్వారా	4,10,534
100, 400 గ్రాముల లడ్డూల విక్రయాల ద్వారా	25,06,450
వసతి గృహాల ద్వారా	2,24,008

క్లుప్తంగా

'సాంస్కృతిక' అధ్యక్షుడిగా వెంకటముత్యం


వెంకటముత్యంను అభినందిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా కొత్తగూడెంనకు చెందిన ఎం.వెంకటముత్యం ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కనకచంద్రం, కమిటీ సభ్యులు ఎంపిక చేసి నియామకపత్రాన్ని వెంకటముత్యంనకు అందజేశారని వివరించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి వెంకటముత్యం ధన్యవాదాలు తెలిపారు.

గుండెపోటుతో ప్రభుత్వ వైద్యుడు మృతి


డాక్టర్ ఆనందరావు (ఫైల్)

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆనందరావు సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. చిత్తూరు జిల్లా ఉంగనూరు నుంచి నియామకాల్లో భాగంగా మణుగూరు ఏరియా ఆస్పత్రికి రెండేళ్ల కిందట నియమితులయ్యారు. ఆనాటి నుంచి గైనకాలజిస్టుగా, సీనియర్ సర్జన్‌గా మణుగూరు సబ్ డివిజన్ ప్రాంత మహిళలకు, ప్రజలకు విశేష సేవలు అందించారు. డాక్టర్ ఆనందరావు మృతి విషయం తెలుసుకున్న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ అధికారి జి.రవిబాబు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్ సంతాపం తెలిపారు. 72 ఏళ్ల వయసులో ఆనందరావు అందించిన సేవలను మరువలేనివని పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు

పాల్వంచరూరల్: భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రంగాపురం సమీపంలోని తాండ్ర కృష్ణారావుకు చెందిన భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని రంగాపురం గ్రామానికి చెందిన తారాచంద్, భూక్యా విజయ్ కొంతమేర కూల్చివేశారు. అంతేకాకుండా భూమి యజమానికి దూషించి, చంపేస్తామని బెదిరించడంతో మంగళవారం సైట్ సూపర్‌వైజర్ ఎస్‌కే జహీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్

- ఒకరు మృతి


తాటి ప్రభాకర్ మృతదేహం

గుండాల: ప్రమాదవశాత్తు ఆగి ఉన్న ఓ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రం పరిధి కొత్తగుంపునకు చెందిన తాటి ప్రభాకర్ (32) ద్విచక్రవాహనంపై రోళ్లగడ్డ గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో రోళ్లగడ్డ తండా, రోళ్లగడ్డ గ్రామం మధ్య లింగగూడెంనకు చెందిన ట్రాక్టర్‌ను డీజిల్ అయిపోవడంతో డ్రైవర్ అక్కడే పెట్టాడు. అటు నుంచి గుండాలకు వస్తున్న ప్రభాకర్ ట్రాక్టర్‌ను ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి 6 నెలల కిందట వివాహమైంది. రెండురోజుల కిందట అత్తగారింటికి వెళ్లిన ప్రభాకర్ మంగళవారం మధ్యాహ్నం వచ్చి రోళ్లగడ్డ వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడికి భార్య సునీత ఉంది.

కోడిపందేల స్థావరంపై దాడి

సాక్షి ఎఫెక్ట్..

పెనుబల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జోరుగా కోడిపందేలు, పేకాట సాగుతున్నా పోలీసులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారంటూ 'ఆట ఆగడం లేదు' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో పోలీసులు పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. పెనుబల్లి మండలంలోని టేకులపల్లి శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం వీఎం బంజర్ పోలీసులు దాడులు చేశారు. ఈసందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని రూ.10 వేలు నగదు, రెండు కోడిపుంజులు, రెండు కత్తులు, తొమ్మిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే, పోలీసులు తనిఖీలకు వస్తుండగా పలువురు పరారవడంతో వారి కోసం గాలింపు చేపట్టారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,454

పడిపోయిన ఆదాయం

- గతేడాది రిజిస్ట్రేషన్ శాఖపై ప్రభావం
- 2022తో పోలిస్తే రూ.31.15 కోట్లు తగ్గుదల
- ఇల్లెందు, వైరా, భద్రాచలంలో మాత్రం కాస్త పైకి..
- మిగతా అన్ని చోట్లా తగ్గిన డాక్యుమెంట్లు, ఆదాయం

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గతేడాది స్వల్పంగా తగ్గింది. జిల్లా నుంచి ప్రభుత్వానికి ఆదాయం భారీగా సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖకు 2023లో అనుకున్నంత ఆదాయం సమకూరలేదు. రూ.250 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేసినా అలా జరగలేదు. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గడంతో 2022తో పోలిస్తే ఆదాయం తగ్గింది. 2023లో అసెంబ్లీ ఎన్నికలు జరగగా ఆ ప్రభావం మార్కెట్‌పై పడిందని రియల్ ఎస్టేట్ వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు గతంతో పోలిస్తే భూముల ధరలు భారీగా పెరిగినందున స్థలాలు కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గిందని తెలుస్తోంది. ఇలా రకరకాల కారణాలతో శాఖకు ఆశించిన మేర ఆదాయం రాలేదని అంచనా వేస్తున్నారు.



రూ.31.15 కోట్లు తగ్గుదల

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో 2023లో 44,837 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.211.71 కోట్లు ఆదాయం సమకూరింది. ఇందులో ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనే రూ. 96.81 కోట్లు ఆదాయం లభించడం విశేషం. 2022లో 50,924 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయగా రూ.242.71 కోట్ల ఆదాయం వచ్చింది. దీంతో 2022తో పోలిస్తే 2023లో రూ.31.15 కోట్ల ఆదాయం తగ్గినట్లయింది. కాగా ఇల్లెందు, వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో స్వల్ప పెరుగుదల కనిపించగా, మిగతా అన్ని కార్యాలయాల్లో ఆదాయం పడిపోయింది. స్థిరాస్తి మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగకముందు 2021లో ఉమ్మడి జిల్లాలో 61,314 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేయగా రూ.209.34 కోట్లు, కోవిడ్ కాలం 2020లో 48,559 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరగ్గా రూ.81.24 కోట్లు ఆదాయం వచ్చింది.

రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా రాబడి వివరాలు (రూ.కోట్లలో)

కార్యాలయం	2022 డాక్యుమెంట్లు	2022 ఆదాయం	2023 డాక్యుమెంట్లు	2023 ఆదాయం
భద్రాచలం	139	0.55	139	0.56
బూర్గంపాడు	378	1.35	245	0.72
కొత్తగూడెం	7,996	46.89	5,697	32.30
మధిర	3,500	12.03	3,398	10.99
కూసుమంచి	6,805	15.69	6,044	13.54
సత్తుపల్లి	2,360	9.65	2,639	9.18
ఇల్లెందు	254	0.87	1,044	7.44
ఖమ్మం	16,277	11.12	14,078	96.81
వైరా	4,600	12.57	4,026	13.51
కల్లూరు	2,127	5.31	2,404	4.47
ఖమ్మంరూరల్	7,088	27.04	5,123	22.64


మంత్రి పొంగులేటికి జ్ఞాపిక అందిస్తున్న డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

ప్రజలు కోరుకున్నట్లుగానే సంక్షేమ పాలన

- వంద రోజుల్లోగా ఆరు గ్యారంటీల అమలు చేస్తాం..
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి


మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రిజిస్ట్రార్ అశోక్


పొంగులేటికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జర్నలిస్టులు

ఖమ్మంవన్‌టౌన్: ప్రజలందరూ కోరుకున్నట్లుగానే సంక్షేమ పాలన అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలోఆయనమాట్లాడారు. మిగులు రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ అసమర్థ, అవినీతి పాలనతో అప్పుల కుప్పగా మార్చిందని, గొప్పలకు పోయి ప్రగతిభవన్ పేరుతో ఇంద్రభవనం కట్టారని విమర్శించారు. ప్రతీ పేదవాడికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టి ఇస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. అలాగే, చేసిన అప్పులను కప్పిపుచ్చేలా సంపదను పెంచామని చెబుతున్నారని విమర్శించారు. పలుచోట్ల ఉన్న కలెక్టరేట్లను కాదని కొత్తగా కట్టారని, కాళేశ్వరం ప్రాజెక్టును లోపభూయిష్టంగా నిర్మించారని ఆరోపించారు. ఇలా ఏ విషయంలో చూసినా తప్పులే తప్ప బీఆర్ఎస్ హయాంలో జరిగిన మంచి లేదని పొంగులేటి తెలిపారు. కానీ తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే భావనతో దరఖాస్తుల స్వీకరణకు ప్రజాపాలన సభలు నిర్వహిస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు అవాకులు, చవాకులు పేలినా చెంప పెట్టులా రెండు గ్యారంటీలను అమలు చేస్తున్న తమ ప్రభుత్వం, త్వరలోనే మిగిలినవీ అమలుచేస్తుందని తెలిపారు. ఇక జర్నలిస్టులతో పాటు ప్రతీ పేదవాడికి విడతల వారీగా ఇళ్లు కట్టి ఇస్తామన్నారు. ఈనెల 15వ తేదీలోగా సమాచార శాఖ ఏడీ కార్యాలయాన్ని ఖమ్మంలో ఏర్పాటు చేయనున్నట్లు పొంగులేటి వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు, డాక్టర్ కోటా రాంబాబు, మలీదు జగన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత మంత్రికి జర్నలిస్టులు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవితో పాటు రామకృష్ణ, శెట్టి రజనీకాంత్, వెన్నబోయిన సాంబశివరావు, బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, ఆడపాల నాగేందర్, చక్రవర్తి, కోటేశ్వరరావు, రమేష్‌బాబు, రాంబాబు, గోపి, ఈశ్వరి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట పలువురు అటవీ శాఖ ఉద్యోగులు ఉన్నారు. అలాగే, జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ అధికారి చిట్టిమళ్ల అశోక్, రిజిస్ట్రేషన్ జిల్లా కార్యాలయం ఆడిట్ అధికారి అడపా రవీంద్రబాబు కూడా మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలి

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చర్ల: ప్రజాపాలన సభల ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని, పౌర ప్రజాస్వామిక హక్కులకు గ్యారంటీ ఇస్తూ ప్రజాస్వామిక తెలంగాణ పునర్నిర్మాణానికి కాంగ్రెస్ సిద్ధం కావాలని మావోయిస్టు పార్టీ కోరింది. పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ మంగళవారం ఒక లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజా పాలన సభలు నిర్వహిస్తోందని, మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలన్న వారి పిలుపు నెరవేరడంతో ఈ కార్యక్రమం చేపట్టి ఉండొచ్చునని ఆజాద్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సభల ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఆ పార్టీ నేతలపై ఉందని పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణలో ఈ అంశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడమే కాక ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసి ప్రజలను నిస్సహాయ స్థితిలోకి నెట్టిందని విమర్శించారు. దీంతో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించినందున వారి సమస్యల పరిష్కారం బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అలాగే, సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ముంపు సమస్య పరిష్కరించాలని, సభలు, సమావేశాలు జరుపుకునేందుకు స్వేచ్ఛ ఇవ్వాలని, దళితులందరికీ దళితబంధు అమలుచేయాలని, ఆదివాసీ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలని ఆజాద్ డిమాండ్ చేశారు.

గ్రామాల్లో జోరుగా కోడి పందేలు


తిరుమలకుంటలోని కోడి పందేల స్థావరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట, కొత్త నారంవారిగూడెం గ్రామాల్లో జోరుగా కోడి పందేలు సాగాయి. మంగళవారం ఆయా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించగా, వందల సంఖ్యలో పందెం కాసేవారు కోడి పుంజులతో తరలివచ్చారు. తిరుమలకుంటలో అయితే ఏకంగా గ్రామ నడిబొడ్డులోని ఖాళీ స్థలంలోనే కోడి పందేలు నిర్వహించగా.. చుట్టు పక్కల గ్రామాలవారు ద్విచక్రవాహనాలు, ఆటోల్లో తరలివచ్చారు. ఒకొక్క పందేన్ని రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు నిర్వహించగా, రూ.లక్షల్లో నగదు చేతులు మారింది. కోడి పందేలపై సమాచారాన్ని అందుకున్న స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ఆయా స్థావరాలపై దాడులు చేయగా జూదరులంతా పోలీసులకు చిక్కకుండా పారిపోయారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మంగళవారం స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.5,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: ఆస్తి పంపకాల్లో వివాదంతో జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ మంగళవారం కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి గొల్లపూడి భానుమతి తీర్పు చెప్పారు. మణుగూరు పైలట్ కాలనీకి చెందిన పెండ్యాల కోటేశ్వరరావుకు ఇద్దరు భార్యలు తులసమ్మ, ధనలక్ష్మి ఉన్నారు. అయితే, కోటేశ్వరరావు ఆస్తి మొత్తం రెండో భార్యకే ఇచ్చాడనే ఆరోపణల నేపథ్యంలో వారి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. కాగా, తులసమ్మ కుమారుడు పెండ్యాల నాగేశ్వరరావు అదే ప్రాంతానికి చెందిన రాధారపు వెంకటనారాయణ కుమార్తెను పెళ్లి చేసుకున్నాడు. అయితే, 2018 అక్టోబర్ 17న గ్యాస్ తెచ్చేందుకు నాగేశ్వరరావు, తులసమ్మ గోదాముకు వెళ్లగా అక్కడే ఉన్న కోటేశ్వరరావు, ఆయన రెండో భార్య ధనలక్ష్మి, వారి కుమారుడు రమేశ్‌కుమార్‌తోపాటు గాజులవరపు వెంకటేశ్వర్లు, గాజులవరపు శ్రీలత దాడి చేశారు. దీంతో రాధారాపు వెంకటనారాయణ.. తన అల్లుడు నాగేశ్వరరావు, అతడి తల్లి తులసమ్మపై హత్యాయత్నం జరిగిందని మణుగూరు పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా జడ్జి 11 మంది సాక్షులను విచారించగా పెండ్యాల కోటేశ్వరరావు, పెండ్యాల ధనలక్ష్మి, పెండ్యాల రమేశ్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికీ ఏడాది సాధారణ జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. గాజులవరపు వెంకటేశ్వర్లు, గాజులవరపు శ్రీలతపై నేరం రుజువు కాకపోవడంతో ఇద్దరిపై ఉన్న కేసు కొట్టివేశారు. అదనపు పీపీ మీర్జా పిర్దౌసీ వాదించగా కోర్టు లైజన్ ఆఫీసర్ హరగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ అశోక్ సహకరించారు.

దేవాలయ భూముల వేలం నిర్వహించాలి


సమావేశంలో గొడవ పడుతున్న గ్రామపెద్దలు

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం–రాజేశ్వరపురం మధ్య ఉన్న రాజగోపాలస్వామి, శివాలయాల భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. స్థానిక రైతువేదికలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశానికి రెండు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. దాదాపు 40ఎకరాల భూములు ఉన్నా దీప, దూప, నైవైద్యాల సమర్పణ, ఆలయ నిర్వహణపై నిర్లక్ష్యం జరుగుతోందని కొందరు ఆరోపించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పలువురు జోక్యం చేసుకుని సమస్య పరిష్కారానికి చర్చించాలని సూచించారు. ఈమేరకు ఆలయ భూముల సర్వే చేయించి ఆక్రమణ నుంచి కాపాడాలని, కొత్తగా కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించాలని, రెండు ఆలయాలకు నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు దండా పుల్లయ్య గండు సతీష్‌తో పాటు రమేష్, యర్రబోయిన నర్సయ్య, ఎస్.మల్లయ్య, అడపాల రవీందర్, దండా నర్సింహారావు, శ్రీనివాసరావు, షేక్ సోందుమియా, యలమద్ది లెనిన్, తన్నీరు రవికుమార్, దండా సతీష్, వాసు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

టిప్పర్, డీజే వాహనం ఢీ..
ముగ్గురికి తీవ్ర గాయాలు


రహదారిపై బోల్తా పడిన డీజే వాహనం

నేలకొండపల్లి: టిప్పర్, డీజే వాహనం ఢీకొన్న ఘటనలో రెప్పపాటున పెను ప్రమాదం తప్పగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని మంగాపురం తండాకు చెందిన నరేష్, ఆనంద్, సంజు డీజే వాహనంలో ఖమ్మం సమీపాన మర్రిచెట్టు తండాలో జరిగే కార్యక్రమానికి మంగళవారం సాయంత్రం బయలుదేరారు. స్థానిక బస్టాండ్ వద్దకు చేరుకుంటుండగా వీరి వాహనం, టిప్పర్ ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై ఢీకొన్నాయి. దీంతో డీజే పల్టీ కొట్టగా, అందులో ఉన్న సౌండ్ బాక్స్‌లు, ఇతర పరికరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే, నరేష్, ఆనంద్, సంజుకు తీవ్ర గాయాలైయ్యాయి. దీంతో వీరిని ఖమ్మం తరలించారు. కాగా, ఈ ప్రమాదంతో ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారిపై భారీగా వాహనాలు నిలిచిగా పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బస్టాండ్‌లో ప్రయాణికుడు మృతి

బోనకల్: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన వేముల రాంబాబు(55) మంగళవారం బోనకల్ వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌లో చేరుకున్నారు. అక్కడ బల్లపై కూర్చున్న ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కింద పడగా నుదుటికి తీవ్రగాయమైంది. సమీప ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని అప్పటికే రాంబాబు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు.

ఇంటికి తీసుకెళ్తే చచ్చిపోతా!

- పీఎస్‌లోనే ఉంటానని తెగేసి చెప్పిన బాలుడు

నేలకొండపల్లి: చెప్పిన మాట వినకుండా, ఇష్టారాజ్యంగా తిరుగుతూ గొడవలకు వెళ్తుండడంతో బుద్ధి చెప్పించాలని పదహారేళ్ల బాలుడిని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. తీరా అక్కడకు వెళ్లాక పోలీసుస్టేషన్‌లో ఉంటానని తెగేసి చెప్పిన బాలుడు ఇంటికి పంపిస్తే చచ్చిపోతానని బెదిరించడంతో తల్లిదండ్రులు, పోలీసులు తలలు పట్టుకున్నారు. నేలకొండపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలుడు తల్లిదండ్రుల మాట వినకుండా, గ్రామంలో ప్రవర్తిస్తుండడంతో పలుమార్లు మందలించినా మార్పురాలేదు. దీంతో మంగళవారం రాత్రి ఆయనను తల్లిదండ్రులు బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తే ఇక ఇంటికి వెళ్లేది లేదని తేల్చిచెప్పాడు. గంటల తరబడి బతిమాలినా వినకపోవడంతో ఏం చేయాలో పాలుపోక తల్లిదండ్రులకు స్టేషన్ వద్దే పడిగాపులు కాస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి స్టేజీ సమీపాన మంగళవారం రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మం రూరల్ మండలం కైకొండాయిగూడెంకి చెందిన గుగులోత్ శివకుమార్ మరిపెడ బంగ్లా వైపునకు వెళ్తుండగా, తిరుమలాయపాలెంకు చెందిన బచ్చలకూరి వీరభద్రం వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో శివ, వీరభద్రంకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

క్షతగాత్రులకు ధైర్యం చెప్పిన మంత్రి

ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లి వద్ద వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై మంగళవారం మధ్యాహ్నం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులు అపస్మారక స్థితిలోకి వెళ్తుండగా, అదే సమయాన తిరుమలాయపాలెంలో ప్రజాపాలన సభ ముగించుకొని ఖమ్మం వస్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన కాన్వాయ్‌ను ఆపించారు. ప్రమాద వివరాలు తెలుసుకుని బాధితులకు ధైర్యం చెబుతూ అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపించారు.

రోడ్డుప్రమాదంపై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ వద్ద ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడగా రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గతనెల 30వ తేదీన మంచుకొండకు చెందిన భూక్యా చంద్రం, సూర్యం ట్రాక్టర్‌లో సిమెంట్ బిల్లల లోడ్‌తో వెళ్తున్నారు. ఈక్రమాన వెనక నుండి వచ్చిన లారీ ఢీకొనగా డ్రైవర్ చంద్రం, పక్కన ఉన్న సూర్యంకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చేర్పించారు. ఘటనపై వీరి తండ్రి మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసుల కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై...

మండలంలోని వేపకుంట్లలో జరిగిన దాడికి సంబంధించి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు మంగళవారం తెలిపారు. వేపకుంట్లకు చెందిన ఆరివికట్ల ప్రేమ్‌కుమార్ సోమవారం రోడ్డుపై నిలబడి ఉండగా, అదే గ్రామానికి చెందిన పవన్, ప్రేమ్‌కుమార్, ప్రసాద్ కారుతో వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో ఆరివికట్ల ప్రేమ్ తీవ్రంగా గాయపడగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శ్మశానవాటికకు వెళ్లే దారిలో ఫెన్సింగ్


శ్మశానవాటిక మార్గంలో ఫెన్సింగ్

రఘునాథపాలెం: మండలంలోని కే.వీ.బంజర గ్రామంలో శ్మశాన వాటిక వెళ్లే రహదారిపై కొందరు ఫెన్సింగ్ వేయగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సర్పంచ్ గుండా మనోహర్‌రెడ్డితో పాటు నాయకులు అజ్మీరా వీరునాయక్, వీరు, భాస్కర్ తదితరులు మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లుగా గ్రామ నక్షా ప్రకారం ఉన్న డొంకను కొందరు రైతులు తమదేనని చెబుతూ దారి మూసేసి ఫెన్సింగ్ వేశారని తెలిపారు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన శ్మశాన వాటికకు దారి లేకుండా పోయిందని, ఈ విషయమై అధికారులు స్పందించాలని కోరారు.

స్థలం ఆక్రమణపై కేసు

ఇల్లెందు: ఇంటి స్థలం కొంటామని ధ్రువపత్రాలు తీసుకుని, అదే స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ప్రశ్నిస్తే హతమారుస్తామని బెదిరిస్తున్నారని ఓ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ టి.కరుణాకర్ కథనం ప్రకారం..ఇల్లెందులపాడుకు చెందిన బి.సువార్తరాణి నుంచి ఇంటి స్థలం డాక్యుమెంట్లను తీసుకున్న వి.మహేందర్ అక్రమంగా ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. 2023 జూలై 26న బి.సువార్తరాణి వెళ్లి ప్రశ్నించగా చంపుతానని బెదిరించాడు. ఈ విషయమై సువార్తరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

జన బలమే గీటురాయి

24 అసెంబ్లీ, 3 ఎంపీ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించిన ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి: నిరంతరం ప్రజాక్షేత్రంలో గడుపుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లి ప్రజల మనసులకు మరింత చేరువైన నేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. సామాజిక న్యాయంలో మరో అడుగు ముందుకేశారు. బీసీలు, మహిళలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక సాధికార ఛాంపియన్ అని మరోసారి రుజువు చేసుకున్నారు. మహిళలు, యువతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ 24 శాసనసభ స్థానాలు, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో జాబితాను ఖరారు చేశారు. గతంలో అగ్రవర్ణాలకు అవకాశం కల్పించిన ఏడు అసెంబ్లీ స్థానాల్లో తాజాగా ఐదు చోట్ల బీసీలను సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి ఈ వివరాలను ప్రకటించారు. గత నెల 11వతేదీన 11 శాసనసభ స్థానాలకు నూతన సమన్వయకర్తలను ప్రకటిస్తూ వైఎస్సార్ సీపీ మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. రెండు జాబితాల్లో కలిపి మొత్తం 35 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలకు పార్టీ సమన్వయకర్తలను ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీ నూతన సమన్వయకర్తలు వీరే..

లోక్‌సభ స్థానం పేరు	సమన్వయకర్త
అనంతపురం	మాలగుండ్ల శంకరనారాయణ(బీసీ-కురుబ)
హిందూపురం	జోలదరాశి శాంత(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి(ఎస్టీ)
శాసనసభ స్థానం పేరు	**సమన్వయకర్త**
రాజాం(ఎస్సీ)	డాక్టర్ తాలె రాజేష్
అనకాపల్లి	మలసాల భరత్ కుమార్(ఓసీ-కాపు)
పాయకరావు పేట(ఎస్సీ)	కంబాల జోగులు
రామచంద్రాపురం	పిల్లి సూర్యప్రకాశ్(బీసీ-శెట్టిబలిజ)
పి. గన్నవరం(ఎస్సీ)	విప్పర్తి వేణుగోపాల్
పిఠాపురం	వంగ గీత(ఓసీ-కాపు)
జగ్గంపేట	తోట నరసింహం(ఓసీ-కాపు)
పత్తిపాడు	వరుపుల సుబ్బారావు(ఓసీ-కాపు)
రాజమండ్రి సిటీ	మార్గాని భరత్(బీసీ-గౌడ)
రాజమండ్రి రూరల్	చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ(బీసీ-శెట్టిబలిజ)
పోలవరం(ఎస్టీ)	తెల్లం రాజ్యలక్ష్మి
కదిరి	బీఎస్ మక్బూల్ అహ్మద్
ఎర్రగొండపాలెం(ఎస్సీ)	చంద్రశేఖర్
ఎమ్మిగనూర్	మాచాని వెంకటేశ్(బీసీ-పద్మశాలి)
తిరుపతి	భూమన అభినయ్ రెడ్డి
గుంటూరు ఈస్ట్	షేక్ నూరి ఫాతిమా
మచిలీపట్నం పేర్ని	కృష్ణమూర్తి(కిట్టు)
చంద్రగిరి	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి
పెనుకొండ	కేవీ ఉషా శ్రీచరణ్(బీసీ-కురుబ)
కళ్యాణదుర్గం	తలారి రంగయ్య(బీసీ-బోయ)
అరకు(ఎస్టీ)	గొడ్డేటి మాధవి
పాడేరు(ఎస్టీ)	మత్స్యరాస విశ్వేశ్వర రాజు
విజయవాడ సెంట్రల్	వెలంపల్లి శ్రీనివాస రావు(ఓసీ- వైశ్య)
విజయవాడ వెస్ట్	షేక్ ఆసిఫ్

కురుబ (బీసీ) సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమించారు. బోయ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ జోలదరాశి శాంత హిందూపురం లోక్‌సభ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని అరకు లోక్‌సభ స్థానం సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించగా, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ను రాజమండ్రి సిటీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవిని అరకు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి,, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కేవీ ఉషాశ్రీచరణ్‌ను పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి, రామచంద్రాపురం ఎమ్మెల్యే చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు.

బీసీలు, మైనార్టీలకు పెద్దపీట..

రెండు దఫాల్లో ప్రకటించిన 35 శాసనసభ స్థానాల సమన్వయకర్తల జాబితాను పరిశీలిస్తే సామాజిక న్యాయానికి సీఎం జగన్ పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది. గతంలో అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులను పోటీకి పెట్టిన ఏడు శాసనసభ స్థానాల్లో ఇప్పుడు ఐదు స్థానాల్లో బీసీలకు, రెండు స్థానాల్లో మైనార్టీ వర్గానికి చెందిన వారిని సమన్వయకర్తలుగా నియమించడం గమనార్హం. ఇక ఐదు శాసనసభ స్థానాలకు మహిళలను సమన్వయకర్తలుగా నియమించారు. పది స్థానాల్లో యువతీ యువకులకు సమన్వయకర్తలుగా అవకాశం కల్పించారు. మొత్తమ్మీద 35 శాసనసభ స్థానాలకు ప్రకటించిన సమన్వయకర్తల్లో ఎస్సీలు 9 మంది, ఎస్టీలు ముగ్గురు, బీసీలు 11 మంది, మైనార్టీలు ముగ్గురు, అగ్రవర్ణాలు 9 మంది (రెడ్డి, కాపు, వైశ్య) చొప్పున ఉన్నారు.

175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా

గత 55 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, చరిత్ర ఎరుగని విప్లవాత్మక సంస్కరణలతో సీఎం వైఎస్ జగన్ జనరంజక పరిపాలన అందిస్తున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ(ప్రత్యక్ష నగదు బదిలీ)తో రూ.2.45 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.67 లక్షల కోట్లు వెరసి మొత్తం రూ.4.12 లక్షల కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. రాష్ట్రంలో సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం అందగా అందులో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉండటం గమనార్హం. ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో తీసుకొచ్చిన మార్పులు కళ్లెదుట కనిపిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లోనూ విజయం సాధించడం సాధ్యమేనని పార్టీ శ్రేణులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. చేసిన మంచిని ప్రజలకు చెప్పి వారితో మమేకమై మరింత మేలు చేయడానికి ఆశీస్సులు కోరాలని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు మార్గనిర్దేశం చేశారు. ప్రజలతో మమేకం కాకుండా వారి మనసులు చూరగొనలేని వారికి టికెట్లు ఇవ్వలేనని ఆది నుంచి సీఎం జగన్ తేల్చి చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా అవసరమైన చోట్ల నూతన సమన్వయకర్తలను నియమిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎంపీ శాంత

సాక్షి, అమరావతి: మాజీ ఎంపీ జె. శాంత మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఆమె వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. ఆమె 2009లో లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. పార్టీలో చేరిన అనంతరం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద జె.శాంత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రజలకు ఆయనపై నమ్మకం ఏర్పడిందని, అందుకే వైఎస్సార్‌సీపీలో చేరానని చెప్పారు. పార్టీలో సామాన్య కార్యకర్తలా పనిచేస్తానని తెలిపారు.



ఎల్బీనగర్‌లో ఓ పెట్రోల్ బంకు వద్ద రద్దీ



లక్డీకపూల్‌లో వాటర్ క్యాన్లతో పెట్రోల్ పట్టుకెళుతున్న దృశ్యం

పెట్రోల్ కటకట!

▶ మొదటి పేజీ తరువాయి

వర్ణనాతీతంగా మారింది. రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారంతో..

వాస్తవానికి రెండురోజుల క్రితమే వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు దిగారు. ఫలితంగా పెట్రోల్ బంకులకు సరఫరా నిలిచిపోయింది. ఇక బుధవారం నుంచి దేశవ్యాప్తంగా ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు పూర్తి స్థాయిలో సమ్మెకు దిగనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో వాహనదారులు ఒక్కసారిగా పెట్రోల్ బంకులకు పోటెత్తారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం వేలాదిగా వాహనాలు బారులు తీరాయి. సమ్మె ఎన్ని రోజులు కొనసాగుతుందో అన్న ఆందోళనతో ఎక్కువమంది ట్యాంకులు ఫుల్ చేయించడం కన్పించింది. కొందరు నిబంధనలకు విరుద్ధంగా పెద్దపెద్ద క్యాన్లలో ఆయిల్ నింపుకొని తీసుకెళ్లారు. దీంతో మధ్యాహ్నానికల్లా చాలా వరకు బంకుల్లో నిల్వలు ఖాళీ అయ్యాయి. ఆయా బంకుల యాజమానులు బంకులు మూసేసి నో స్టాక్ బోర్డులు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3,500 పెట్రోల్ బంకులు ఉండగా 3 వేల వరకు బంకులు మూతపడటంతో సాయంత్రానికి పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమయ్యింది. హైదరాబాద్ నగరంలోని పెట్రోల్ బంకులన్నింటిలో నిల్వలు ఖాళీ అయ్యాయి.

తాత్కాలికంగా సమ్మె విరమణ

రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో నిల్వలు ఖాళీ కావడంతో డీలర్ల సొంత ట్యాంకర్లను రంగంలోకి దింపారు. వారు ఆందోళన విరమించి ఇంధన సరఫరాకు సిద్ధమయ్యారు. మరోవైపు సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నట్లు రాష్ట్ర పెట్రోల్ డీజిల్ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. కేంద్రం తీసుకొచ్చిన మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లుకు నిరసనగా డ్రైవర్లు సోమవారం నుంచి ఆయిల్ టాంకర్స్ నిలిపివేసి ఆకస్మిక సమ్మెలోకి వెళ్ళారని తెలిపారు. దేశవ్యాప్తంగా కూడా ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల అసోసియేషన్లు కూడా సమ్మె విరమించే అవకాశాలు ఉండటం, చమురు సంస్థల డిపోల వద్దకు డీలర్ల ట్యాంకర్లు లోడింగ్‌కు చేరుకోవడంతో బుధవారం ఆయిల్ సరఫరాకు అంతరాయం ఉండబోదని డీలర్ల వర్గాలు ప్రకటించాయి.

ఇంధన సరఫరాలో కొరత ఉండదు: పౌరసరఫరాల శాఖ కమిషనర్

ఇంధన ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మెకు పిలుపునివ్వడంతో పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ మంగళవారం పౌరసరఫరాల భవన్‌లో బీపీసీఎల్, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమ్మె చేస్తున్న ట్యాంకర్ల డ్రైవర్లతో చర్చించాలని, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా చూడాలన్నారు. ఆయిల్ కంపెనీలకు, డ్రైవర్లకు తాము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే విధుల్లో చేరాలని ట్యాంకర్ల డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని, ప్రజలు ఆందోళనకు గురికావద్దని కమిషనర్ ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అప్పా జంక్షన్ వద్ద ఎస్ఐకి గాయాలు!

రాజేంద్రనగర్: బండ్లగూడ అప్పా జంక్షన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి సిబ్బందికి వాహనదారులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పెట్రోల్ కోసం వచ్చిన సందర్భంగా వాగ్వివాదం జరగడంతో పరస్పరం దాడి చేసుకున్నట్టు సమాచారం. ఈ పెట్రోల్ బంకును పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. విధుల్లో ఉన్న ఒక ఎస్ఐ ర్యాంకు అధికారితో పాటు సిబ్బందికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. అయితే దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు చెప్పారు.

సీఎం జగన్‌ను ఎదుర్కోలేక దుష్ప్రచారం చేస్తారా?

- చంద్రబాబు, ఎల్లో మీడియాపై వైవీ సుబ్బారెడ్డి ఫైర్

సాక్షి, అమరావతి: ఏపీలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ ప్రజల్లో ఆదరణ మరింతగా పెరుగుతోందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అత్యంత ప్రజాదరణ ఉన్న సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో కలిసి కట్టుకథలు అల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సుబ్బారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తనకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా వైఎస్ విజయమ్మను, కుటుంబ సభ్యులను కలుస్తానని తెలిపారు. ఇటీవల అమెరికాకు వెళ్లి వచ్చిన విజయమ్మను ఆదివారం కలిసి కుటుంబ విషయాలు మాట్లాడుకున్నట్లు చెప్పారు. ఆ తర్వాత షిరిడి వెళ్లి, సోమవారం రాత్రి విజయవాడ వచ్చాక ఎల్లో మీడియాలో వార్తలు చూశానని తెలిపారు. షర్మిలతో తాను మధ్యవర్తిత్వం చేసినట్లు కట్టుకథలు అల్లారని మండిపడ్డారు. కుటుంబ సభ్యులను కలవడానికి వెళ్తే రాయబారానికి వెళ్లినట్లా అని ప్రశ్నించారు. చంద్రబాబును సీఎం పీఠంపై కూర్చోబెట్టడం కోసమే ఎల్లో మీడియా తమపై బురద జల్లుతోందని, వారి దుష్ప్రచారం పరాకాష్టకు చేరిందని అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌దే విజయమని స్పష్టం చేశారు.

జిల్లా వార్తలు

భద్రాద్రి కలెక్టర్‌ను కలిసిన కేటీపీఎస్ ఎస్ఈలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలను పాల్వంచలోని కేటీపీఎస్ ఏడో దశ సీఈ పి.వెంకటేశ్వరరావు, 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈ వై.వెంకటేశ్వర్లు, డి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదంపై డీఈఓ విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

సత్తుపల్లిటౌన్: పాఠశాలలను తనిఖీ చేసిన సమయాన ఉపాధ్యాయులు ప్రొటోకాల్ పాటించలేదంటూ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేసిన ఫిర్యాదుతో డీఈఓ ఈ.సోమశేఖరశర్మ మంగళవారం సత్తుపల్లి పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ పాఠశాల పక్కనే ఉన్న జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మరో ఇద్దరు ఉపాధ్యాయులపై కూడా ఫిర్యాదు అందడంతో విచారణ నిర్వహించినట్లు డీఈఓ వెల్లడించారు. పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే రాగమయి గతనెల 18న తనిఖీ చేయగా హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్ ప్రొటోకాల్ పాటించలేదంటూ ఫిర్యాదు చేశారు. అలాగే, అధికారుల అనుమతి లేకుండానే విద్యార్థులను పిక్నిక్‌కు తీసుకెళ్లి, మరుసటి రోజు అనుమతి తీసుకోకుండా సెలవు ఇచ్చినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలు, హెచ్ఎంల నుంచి లిఖిత పూర్వక వివరాలు సేకరించిన డీఈఓ మాట్లాడుతూ వారం తర్వాత పూర్తి స్థాయి విచారణ చేపడుతామని తెలిపారు.

జీడీఎస్‌ల ఉద్యోగ వెతలు

- సమ్మెతో ఉద్యోగాలు కోల్పోయిన 256 మంది
- ఊహించని చర్యతో వీధినపడిన కుటుంబాలు
- ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలుస్తున్న సంఘం నేతలు



ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం

ఖమ్మంగాంధీచౌక్: సమ్మెతో ఉద్యోగం కోల్పోయిన గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)ల స్థితి దయనీయంగా మారింది. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ స్థాయిలో ఏర్పడిన గ్రామీణ డాక్ సేవక్స్ పోస్టల్ జేఏసీ ఆధ్వర్యాన గత నెల 12 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఎనిమిది గంటల పని విధానం, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, కమలేశ్ చంద్ర కమిటీ సానుకూల సిఫారసులను అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలనే డిమాండ్లతో సమ్మెకు దిగగా ఖమ్మం తపాలా డివిజన్‌లోనూ 256 మంది పాల్గొన్నారు. దీంతో తపాలా సేవలకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమాన సమ్మెపై ఆరా తీసిన కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు వ్యవహరించాలని తపాలా అధికారులకు సూచించింది. దీంతో ఉన్నతాధికారులు సమ్మెను సీరియస్‌గా పరిగణించి పలువురిని ఉద్యోగాల నుంచి తొలగించారు.

నిబంధనల మేరకు తొలగింపు

గ్రామీణ డాక్ సేవక్‌లు ఉద్యోగంలో చేరే సమయాన పలు నిబంధనలు, షరతులతో కూడిన పత్రాలపై సంతకాలు చేశారు. దీంతో 2021లో ఉద్యోగంలో చేరిన జీడీఎస్‌లు సమ్మెల్లో పాల్గొనొద్దనే నిబంధనున్నా అతిక్రమించారని చెబుతూ ఉన్నతాధికారులు నోటీసులు ఇవ్వకుండా మూడేళ్లుగా జీడీఎస్‌లుగా పనిచేస్తున్న వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. గతనెల 15న వీరిని తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడగా, ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో 256 మంది ఉద్యోగాలు కోల్పోయారు. అప్పటికే నోటీసులు జారీ కావడంతో పలువురు విధుల్లో చేరారు. ఖమ్మం తపాలా డివిజన్ పరిధిలో మొత్తం 550 మంది వరకు సమ్మెలో పాల్గొనగా.. వీరిలో 256 మంది ఉద్యోగాలు కోల్పోయారు.

ఆశలు నెరవేరకపోగా..

సమ్మెతో ఉద్యోగాలు కోల్పోతామని జీడీఎస్‌లు ఊహించలేదు. నెలకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వేతనంతో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న వారు మరిన్ని ప్రయోజనాలు అందుతాయని ఆశించారు. కానీ అలా జరగకపోగా ఉన్న ఉద్యోగం పోవడంతో చిరుద్యోగులు షాక్‌కు గురయ్యారు. వీరంతా ఇప్పుడు నిత్యం తపాలా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని అధికారులకు విన్నవిస్తున్నారు.

సేవలకు ప్రత్యామ్నాయం

తపాలా సేవల్లో గ్రామీణ డాక్ సేవకుల పాత్ర కీలకం. పలు బ్రాంచ్‌ల నిర్వహణ వీరిపై ఆధారపడగా ఇప్పుడు తొలగించడంతో నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. దీంతో ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతున్న జీడీఎస్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పలు బ్రాంచ్‌లు ఒక పూట మాత్రమే కొనసాగుతుండగా వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కేంద్రమంత్రులు, ఎంపీలకు వినతి

జీడీఎస్‌లను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని జేఏసీ నేతలు తపాలా ఉన్నతాధికారులు, కేంద్ర మంత్రులను కోరుతున్నారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో జేఏసీ ప్రతినిధులు సీహెచ్ కోటేశ్వరరావు, బండి జయరాజు తదితరులు కేంద్ర మంత్రులు అశ్విన్ వైష్ణవ్, కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను కలిసి జీడీఎస్‌లను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకునేలా చొరవ చూపాలని కోరగా తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ బి.విద్యాసాగర్ రెడ్డి, పోస్ట్‌మాస్టర్ జనరల్ సునీత అయోధ్యకు వినతిపత్రాలు అందించారు. అయితే, సమస్య కేంద్ర ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించాల్సి ఉండటంతో తమకు న్యాయం జరుగుతుందా, లేదా అని జీడీఎస్‌లు ఆందోళన చెందుతున్నారు.

స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా వీరయ్య



వీరయ్యను సన్మానిస్తున్న ఎర్రా కామేశ్

పాల్వంచ: స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పాల్వంచకు చెందిన చిలకబత్తిని వీరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తెలంగాణ స్వేరో రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గురి దుర్గయ్య ఆధ్వర్యాన సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. అధ్యక్షుడిగా తనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దారమల్ల ప్రకాశ్, కోశాధికారిగా లక్నారపు శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా ప్రణీత శుభశ్రీ తదితరులను ఎన్నుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వాన ఏర్పడిన స్వేరోస్ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తామని వీరయ్య తెలిపారు. కాగా, స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వీరయ్యను బీఎస్పీ నాయకుడు ఎర్రా కామేశ్ ఆధ్వర్యాన మంగళవారం సన్మానించారు. నాయకులు చెనిగరపు నిరంజన్‌కుమార్, నాగుల రవికుమార్, శ్రీను, లోకేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమాయి బాధ్యతల స్వీకరణలో పాల్గొంటారు. అక్కడ ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలకు హాజరయ్యాక మధ్యాహ్నం 2.30గంటలకు భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి చేరుకుంటారు. ఈ సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరి గేషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న పంప్ హౌజ్ పనులను పరిశీలించి ప్రాజెక్టుపై పనులపై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్షించనున్నారు.

ఎస్సెస్సీ ఫలితాల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ

- వంద శాతం సాధించేలా ప్రణాళికలు
- భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్, పక్కన డీడీ మణెమ్మ

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పీఎంహెచ్ హాస్టళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వంద శాతం ఫలితాలు సాధించాలని పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థులు వంద శాతం పాఠశాలకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు, వార్డెన్లు, సబ్జెక్ట్ టీచర్లు పర్యవేక్షించాలని, రోజువారీ పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన వారిని తీర్చిదిద్దాలని తెలిపారు. కంప్యూటర్, ప్రొజెక్టర్ ద్వారా బోధనకు ప్రత్యేకంగా ఒక టీచర్‌ను నియమించాలని సూచించారు. అలాగే, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఓ ఆదేశించారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనుల చెంతకు చేర్చి వారి అభివృద్ధికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన అధికారులు, సిబ్బంది సమక్షాన కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. వివిధ సమస్యలు, పనుల నిమిత్తం ఐటీడీఏకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి పాటుపడాలని తెలిపారు. కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు తానాజీ, విజయ్‌కుమార్, సురేశ్‌బాబు, భాస్కరన్, రమణయ్య, ఆర్.శ్రీనివాస్, టి.వెంకటేశ్వరరాజు, రూపాదేవి, అలివేలు మంగతాయారు, రమణమూర్తి, పోశాలు, హెచ్‌ఎంలు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

నియామకాలు జరిగినట్టా.. లేనట్టా?



జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు (ఫైల్)

- సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్లకు గత నెల 18న నియామకపత్రాలు
- ఆ మరుసటి రోజే నిలిపివేస్తూ ఉత్తర్వులు
- ఆందోళన చెందుతున్న అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చి, ఒకే రోజు వ్యవధిలో నియామకాలను రద్దుచేయడం అభ్యర్థులను ఆవేదనకు గురిచేస్తోంది. మళ్లీ నియామక పత్రాలు ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నారు. సింగరేణిలో గతేడాది జూనియన్ అసిస్టెంట్ గ్రేడ్-2 పోస్టుల నియామకానికి రాతపరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేశాక కొందరు అభ్యర్థులు కోర్టుకెళ్లారు. దీంతో వాదోపవాదాల అనంతరం కోర్టు మళ్లీ పరీక్ష నిర్వహించాలని సంస్థను ఆదేశించింది. ఈ తీర్పుపై సింగరేణి అధికారులు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించడంతో పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదని తీర్పునివ్వడంతో అధికారులు ఫలితాలు వెల్లడించడమే కాక అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించి మెడికల్ చెకప్ నిర్వహించే క్రమాన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. దీంతో ప్రక్రియ నిలిపేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత గుర్తింపు సంఘం ఎన్నికల కోడ్ రావడంతో నియామకపత్రాలు ఇవ్వడంలో జాప్యం జరిగింది. ఇంతలోనే కోడ్ అమల్లో ఉన్నా అధికారులు డిసెంబర్ 18న 146 మందికి నియామక పత్రాలు ఇచ్చి, మరుసటి రోజైన 19న నిలిపివేశారు. ఇదేమిటని ఆరా తీస్తే ఎన్నికల కోడ్ అమల్లో ఉండటమే కారణమని తెలిపారు. అయితే, డిసెంబర్ 28న కోడ్ ముగిసినా నేటి వరకు ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ విషయమై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం, సింగరేణి చరిత్రలో మునుపెన్నడూ ఇలా జరగకపోవడంతో సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయమై సింగరేణి జీఎం (పర్సనల్) బి.హన్మంతరావును వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూనియర్ అసిస్టెంట్ల నియామకాలు నిలిపివేశామని, మళ్లీ ఆదేశాలు వస్తే ముందుకు సాగుతామని తెలిపారు.